క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



ఖానాపురం: మండలంలోని బుధరావుపేట, ఖానాపురం గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ బాధ్యులు రాణాప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, సోషల్ మీడియా మండల కన్వీనర్ దాసరి రమేష్, రాధారపు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపురం: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను నర్సంపేట బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. ఖానాపురం గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి రోడ్డు ప్రమాదంలో, మనుబోతులగడ్డకు చెందిన దేవ్లా విద్యుత్‌షాక్‌తో, ఇదే గ్రామానికి చెందిన అఫ్రీనా పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను పెద్ది పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ ప్రకాశ్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల యూత్ ఇన్‌చార్జ్ వడ్డె వెంకటేష్, ఉప సర్పంచ్ కుమార్, తదితరులు ఉన్నారు.

చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సంగెం: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చింతలపల్లికి చెందిన బొమ్మ భద్రయ్య(41) రోజువారి వృత్తిలో భాగంగా ఆదివారం తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో ఎంజీఎంకు తరలించి చికిత్స చేయిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఫ్లెక్సీల తొలగింపు



నర్సంపేట రూరల్: పట్టణంలోని సర్వాపురంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభ సోమవారం నిర్వహించారు. సభకు సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణులు పట్టణంలోని పలు జంక్షన్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

సిద్ధేశ్వరాలయంలో దీపారాధన



చెన్నారావుపేట: కార్తీకమాసం మొదటి సోమవారం సాయంత్రం స్థానిక సిద్ధేశ్వరాలయంలో దీపారాధన పూజా కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



రాయపర్తి: మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కుందూరు గోపాల్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. ఇక నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, కాకిరాల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న అమిత్ ప్రతాప్‌సింగ్

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం, అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా దీపావళి వేడుకలు

ఖానాపురం/పర్వతగిరి/నెక్కొండ/చెన్నారావుపేట/సంగెం/రాయపర్తి: ఆయా మండలాల వ్యాప్తంగా దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల వద్ద దీపాలు వెలిగించారు. ఇంట్లో ప్రత్యేక పూజలు చేసుకొని వేడుకలు చేపట్టారు. రైతులు, వ్యాపారులు దీపావళిని పురస్కరించుకుని సూర్యోదయానికి ముందుగానే గోగు కర్రలు, మోదుగు కర్రలతో చేసిన కాగడాలు(దుందువ్వ)లను అందరిపై తిప్పుకుని తలంటూ స్నానమాచరించారు. కేదారేశ్వరిస్వామి వ్రతాలు చేసుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. చిన్నా,పెద్దా తేడా లేకుండా అందరూ పెద్ద ఎత్తున టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. దీపావళి వేడుకతో ఆయా మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.



చెన్నారావుపేట : కేదారేశ్వర వ్రతంలో పాల్గొని పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు



రాయపర్తి: టపాసులు కాలుస్తున్న కుటుంబ సభ్యులు



సంగెం : పూజలు చేస్తున్న భక్తులు

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: బహుళ అమావాస్య సందర్భంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల మహాన్యాస రుద్రాభిషేకం, శుద్ధమైన నువ్వుల నూనెతో తైలాభిషేకం చేసి, ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే, రామాలయంలో సీతారామచంద్రస్వామికి ప్రత్యేక అర్చనలు చేశారు. పూజా కార్యక్రమాల్లో కార్యనిర్వాహణధికారి శేషభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధన చార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

కార్తీక మాసోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి ఆలయంలో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. సాయంకాలం సూర్యాస్తమయంలో రోజూ హరిహరులకు ఆకాశ దీపోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా



వర్ధన్నపేట: బీఆర్ఎస్‌లోకి వచ్చిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న అరూరి



వరంగల్: 14వ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేష్

హసన్‌పర్తి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. నగరంలోని 65వ డివిజన్ చింతగట్టుకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో సోమవారం చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు.

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లందలో బీజేపీ జిల్లా కార్యదర్శి పిట్టల రాజు, మహిళా మోర్చా నాయకురాలు పిట్టల స్వప్న, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చీపురు వెంకటస్వామి, ల్యాబర్తికి చెందిన బీఎస్పీ నుంచి మండల అధ్యక్షుడు సంకినేని మధుతో పాటు 100 మంది కార్యకర్తలు అరూరి రమేష్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

శ్రీసూక్త యాగం, ధనలక్ష్మి పూజ

హన్మకొండ కల్చరల్: దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అష్టైశ్వర్యాలు కలగాలని దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామిజీ ఉద్బోధించారు. ములుగురోడ్డులోని వరద దత్తక్షేత్రంలో స్వామిజీ ఆధ్వర్యంలో వేద పండితులు ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయం శ్రీసూక్త మహాలక్ష్మి యాగం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఇంకా పోలీసుననుకుంటున్నాడు..

హసన్‌పర్తి: కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఆర్.నాగరాజు ఇంకా పోలీసుననుకుంటున్నాడని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్ విమర్శించారు. హనుమకొండలోని అరూరి రమేష్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్‌తో కలిసి ఆమె మాట్లాడారు. వర్ధన్నపేట పోలీస్ అధికారిగా ఉన్నప్పుడు పలువురిపై అక్రమ కేసులు పెట్టిన నాగరాజు రిటైర్డ్ అయ్యాక కూడా కేసులు పెడుతానని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

అరూరికి ఏనుగల్లు మాదిగ సంఘం మద్దతు

పర్వతగిరి: బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్‌కు మండలంలోని ఏనుగల్లుకు చెందిన మాదిగ సంఘం కులస్తులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మాసాని వెంకట్, మండల యూత్ ప్రెసిడెంట్ నరేందర్‌వర్మ పాల్గొన్నారు.

అభివృద్ధే 'అరూరి'ని గెలిపిస్తుంది

వరంగల్: నగరంలోని 14వ డివిజన్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ చేసిన అభివృద్ధి పనులే ఆయనను తిరిగి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడుసు నర్సింహ అన్నారు. రమేష్‌ను గెలిపించాలంటూ ఏనుమాముల మార్కెట్ నుంచి 100 ఫీట్ల రోడ్డు మీదుగా నర్సంపేట ప్రధాన రహదారి వరకు భారీ ర్యాలీగా సోమవారం పాదయాత్ర నిర్వహించారు. కార్పొరేటర్ తూర్పాటి సులోచన, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల్లో నేతల విస్తృత ప్రచారం

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాల కాంగ్రెస్, బీజేపీ పార్టీ అభ్యర్థులు తమ ప్రచారాలను చేపట్టారు. నర్సంపేట కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి, బీజేపీ అభ్యర్థి కంభంపాటి పుల్లారావు, వర్ధన్నపేట కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కేఆర్ నాగరాజు, కొండేటి శ్రీధర్, పరకాల బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు చల్లా ధర్మారెడ్డి, కాళీప్రసాదరావు, రేవూరి ప్రకాష్‌రెడ్డిలు ఆయా గ్రామాల్లో ప్రచారంలో పాల్గొని తమను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే పాలకుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మామిడాల యశస్వినిరెడ్డి, లేగ రాంమోహన్‌రెడ్డి ప్రచారంలో పాల్గొని ఈసారి జరిగే ఎన్నికల్లో అవకాశం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సభకు భారీ ఏర్పాట్లు



తొర్రూరులో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి దయాకర్‌రావు



కొడకండ్ల : సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

- నేడు తొర్రూరులో బీఆర్ఎస్ ఆశీర్వాద సభ
- భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపు
- పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు : శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నేడు (మంగళవారం) తొర్రూరులో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు పట్టణ శివారు మహబూబాబాద్‌కు వెళ్లే రోడ్డులో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తొర్రూరు శివారు మహబూబాద్ రోడ్డులో ఏర్పాటు చేసిన సభ కోసం వేదిక, వాటర్ ప్రూఫ్, 50 మంది ఆసీనులయ్యేలా వేదికను సిద్ధం చేశారు. కళాబృందాల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తే జరిగే అభివృద్ధిని, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను సీఎం ప్రజలకు వివరించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సభ జరగనుంది. పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం సభను దృష్టిలో పెట్టుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గ్యారంటీ, వారంటీలేని పథకాలతో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అర్రులు చాస్తోందని మంత్రి దయాకర్‌రావు అన్నారు. రైతుబంధు, బీమా ఆపాలని కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం రైతులను మోసగించడమేనన్నారు. సభా ఏర్పాట్ల పర్యవేక్షణలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, డాక్టర్ పి.సోమేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషిని చాటాలి

దేవరుప్పుల : తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో సీఎం కెసీఆర్ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్లో చాటాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొర్రూరులో నేటి కేసీఆర్ సభకు నిర్దేశిత జనం కంటే అధికంగా తరలించేలా పార్టీ నాయకులు పాటుపడాలన్నారు. ధరావత్‌తండా బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కొత్త జలంధర్‌రెడ్డి, సర్పంచ్ గేమా నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సమావేశంలో ఎంపీపీ బస్వసావిత్రిమల్లేశం, జెడ్పీటీసీ పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ మండల అధ్యక్షుడు రామ్‌సింగ్, ప్రధాన కార్యదర్శి చింత రవి, చామల విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

పాలకుర్తి: ఎన్నికల ప్రచారంలో భాగంగా తొర్రూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం పాలకుర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత మరింత అభివృద్ధి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పెద్దవంగర: తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సీఎం కేసీఆర్ సభకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని చెప్పారు. అభివృద్ధిని చూసి ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ నే తల మాటలు నమ్మొద్దని, వారితో జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, పుసులేటి వెంకటరామయ్య, కాసాని హరీష్, ఎర్రాని రామ్మూర్తి, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా..

కొడకండ్ల : తొర్రూరులో మంగళవారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అ న్నారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, అండగా నిలిచి ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. సభకు అన్ని గ్రామాల నుంచి ప్రజలు సభకు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజలను అవమానిస్తే పాతరపెడదాం..

రాయపర్తి : పాలకుర్తి ప్రజలను అవమానించిన కాంగ్రెస్‌ను పాతర పెడదామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక కుందూరు కృష్ణారెడ్డి దొడ్డిలో తొర్రూరులో నిర్వహించే సీఎం కేసీఆర్ సభకోసం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పాలకుర్తి సభలో దళితులను అవమానిస్తూ కాలుతో తన్నిన రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పేలా సీఎం కేసీఆర్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇవ్వాల ఇక్కడ రేపు ఎక్కడో తెలియని వాళ్లకు ఓటు వేద్దామా అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ నర్సయ్య పాల్గొన్నారు.

దయాకర్‌రావు గెలవాలని పూజలు

పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు లక్ష ఓట్ల మెజార్టీతో గెలవాలని కోరుతూ మండలంలోని శివరామపురం దుర్గమ్మ ఆలయంలో 101 కొబ్బరికాయలను కొట్టారు. గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు కడెం లక్ష్మీవెంకటయ్య దంపతులు దయాకర్‌రావుపై అభిమానంతో కొబ్బరికాయలను దుర్గమ్మ దేవతకు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ అనిమిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని జయరాంతండా(కె)కు చెందిన బీజేపీ యూత్ నాయకులు సోమవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నయీంనగర్: ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలని పోరాటం చేస్తున్న రైతులు, యువకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి, వెంటనే వారిని విడుదల చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ్ల రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ నారాయణ పేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్‌లో ఏర్పాటు చేసిన ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలని పరిసర గ్రామాల ప్రజలు రెండేళ్లుగా పోరాడుతున్నారని తెలిపారు. వారిని అక్రమంగా అరెస్టు చేసి జైల్‌లో పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి అరెస్టును వివిధ ప్రజా సంఘాల నాయకులు ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తంపుల మొగిళి, ఉదమ్‌సింగ్, గుండె ప్రమోద్, గాదరి చిన్న, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజన తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

హన్మకొండ: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన ఓటు హక్కును ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండలో దళిత బహుజన ఫ్రంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును దుర్వినియోగం చేయొద్దని, అవినీతిని అంతమొందించే దిశగా ఓటర్లు అడుగులు వేయాలని చెప్పారు. సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా నాయకులు శ్రీనివాస్, సాంబయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

గూడూరు: మండలంలోని అయోధ్యపురం వద్ద ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ కారును అడ్డుకున్న కేసులో సోమవారం ముగ్గురుపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు. బానోతు శంకర్‌నాయక్ పది రోజుల క్రితం మృతిచెందిన పొనుగోడు గ్రామానికి చెందిన సర్పంచ్ నలమాస వెంకన్నగౌడ్ దశదినకర్మకు కారులో వెళ్లి వస్తున్నారు. అయోధ్యపురం శివారులోకి రాగా ముగ్గురు మద్యం మత్తులో కారును ఆపారు. వెంటనే కారు దిగిన ఎమ్మెల్యే గన్‌మెన్లు ఎందుకు ఆపుతున్నారని అడిగారు. వారు బూతులు తిడుతూ, విధులకు ఆటంకం కల్గించారు. అక్కడ నుంచి పోలీస్‌స్టేషన్ చేరుకున్న లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

శాయంపేట : మండలంలోని పత్తిపాకకు చెందిన పున్నం కర్ణాకర్ గడ్డివాము ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం. కర్ణాకర్ తనకున్న రెండు ఎకరాల భూమిలో వరి పంట సాగు చేసిన వరిగడ్డితో పాటు మరికొంత కొనుగోలు చేసి ఇంటి ఆవరణలో ఉంచాడు. సోమవారం దీపావళి పండుగకు మాదన్నపేటకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వరిగడ్డికి నిప్పు అంటుకొని కాలుతుండగా గొర్రెల కాపర్లు గమనించి పక్కింటి వారికి సమాచారం ఇచ్చారు. దీంతో స్థానికులు మోటర్ల నీటిసాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ మంటలు అదుపులోకి రాకపోవడంతో పరకాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో 25వేల గడ్డి దగ్ధమైందని బాధితుడు వాపోయాడు.



మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

లఘుచిత్రం రిలీజ్

శాయంపేట : గ్రామానికి చెందిన గాజుల రామకృష్ణ రూపొందించిన లఘు చిత్రాలను స్థానిక సర్పంచ్ రవి సోమవారం జీజేఎల్ యూట్యూబ్ చానల్‌లో విడుదల చేశారు. సమాజంలో నెలకొన్న సమస్యలను చిత్రీకరించిన లఘు చిత్ర దర్శకుడు గాజుల రామకృష్ణ ఆలోచన అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రమేష్, వెంకటరమణ, రవీందర్, నర్సయ్య, సాంబయ్య, స్వామి, అశోక్, రామకృష్ణ, రాజు, సాదిక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కాశిబుగ్గ: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన నెక్కొండ – ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గేటుపల్లి తండాకు చెందిన బాదావత్ కిరిసింగ్ (43) మానసిక స్థితి సరిగాలేక 10ఏళ్ల క్రితం ఆర్మీలో ఉద్యోగం, భార్య పిల్లలను వదిలేసి నెక్కొండలో ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం రైలు పట్టాలు దాటుతుండగా మూడవ లైన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో తలపగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి కిరిసింగ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి ఓ గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందిన ఘటన నెక్కొండ - ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య గేటుపల్లి రైల్వేగేట్ సమీపంలో సోమవారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం 25 - 30 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలకు వరంగల్ జీఆర్పీ స్టేషన్‌లో, 87126 58585 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డీసీఎం వ్యాన్ ఢీకొని..

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్ రోడ్డు నీలిమా జంక్షన్‌లో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం, గున్నెపల్లి గ్రామానికి చెందిన చిల్లా సిద్ధార్థ (21) విశాల్‌మార్ట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసి విధులు ముగించుకొని అదాలత్ వైపు వస్తుండగా విష్ణుప్రియ గార్డెన్‌కు వైపు వెళుతున్న డీసీఎం వ్యాన్ అతన్ని ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ బైక్‌పై ఉన్న మరో ఇద్దరు గుగులోతు పవన్, ప్రమోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి.